క్లుప్తంగా

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ రమేష్

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కె.రమేష్ సూచించారు. ఈ మేరకు ఆయన సుజాతనగర్‌లో శుక్రవారం పర్యటించి గృహజ్యోతి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు వారి ఆధార్, రేషన్ కార్డు, ప్రజాపాలన రశీదు, మొబైల్ నంబర్, కరెంట్ బిల్ తదితర ధృవీకరణ పత్రాలను విద్యుత్ సిబ్బందికి అందజేయాలన్నారు.

నృత్య ప్రదర్శనలో ప్రతిభ



వరలక్ష్మి, శ్రీరక్షా రుచితకు అవార్డు అందజేస్తున్న మాజీ మంత్రి బాబూమోహన్

పాల్వంచ: ఈనెల 8న హైదరాబాద్‌లో స్వర విహార్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ సెలబ్రేషన్స్‌లో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో సంతోషి మాత నాట్య నిలయం నాట్య గురువు వరలక్ష్మి ఆధ్వర్యంలో పాల్వంచ శ్రీరక్షా ఆస్పత్రి అధినేత గణేష్ కూతురు రుచిత శ్రీరక్ష నృత్య ప్రదర్శన చేసి ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సినీనటుడు బాబూమోహన్, నిర్వాహకులు జయరాజన్ రుచితకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పాల్వంచలో శుక్రవారం చిన్నారి రుచిత శ్రీరక్షను పలువురు అభినందించారు.

పీహెచ్‌సీకి వితరణ



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డెంటల్ యూనిట్‌లోని యంత్ర పరికరం మరమ్మత్తులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి రూ.15 వేలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వెంకటరెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్, దంత వైద్యురాలు ప్రదీప్తి, డాక్టర్ తేజస్విని, డాక్టర్ పోటు వినోద్, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, కోటా కుమార్‌బాబు, దాసరి నాగయ్య, మందా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: మాజీ భారత ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం పట్ల పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాము నాయక్, ఒలపల్లి రాంబాబు, ఉపేందర్, గౌస్, ఇమ్మానియేల్, శేఖర్, శిరసాని రమణ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఉద్యోగులు, అంగన్‌వాడీలు

టేకులపల్లి: బిల్లుడు తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, అంగన్‌వాడీలు సర్పంచ్ అజ్మీర గలకను శాలువా కప్పి, స్వీట్లు తినిపించి సన్మానించారు. ఐదు సంవత్సరాలు పంచాయతీ అభివృద్ధికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గిరిజన ఉద్యోగ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హతీరాంనాయక్, ఉపాధ్యక్షుడు భుక్యా రాంజీ నాయక్, హెచ్‌ఎం లోక్యా, కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన

- ఇల్లెందులో 2,008 మంది దరఖాస్తుల్లో తప్పులు
- మున్సిపాలిటీలోని 24 వార్డులలో 9,415 గృహాలు
- ఐదు గ్యారంటీ పథకాలకు 10,373, ఇతర దరఖాస్తులు 1,338



ఇల్లెందు: వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకం దరఖాస్తుల్లో తప్పులు దొర్లినట్లు అధికారులు గుర్తించారు. ఆ దరఖాస్తులను పరిశీలించి తప్పులను సరి చేసేందుకు, సవరించిన దరఖాస్తులను నమోదు చేసేందుకు ఇంటింటి సర్వేను చేపట్టారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రతీరోజు మూడు వార్డులలో గ్రామసభలు జరిపి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పట్టణంలోని 24 వార్డులలో 9,415 గృహాలు ఉండగా ఐదు గ్యారంటీల కోసం 10,373 దరఖాస్తులు సమర్పించారు. ఇతర సమస్యల కోసం 1,338 దరఖాస్తులు వచ్చినట్లు మండల అధికారులు తెలిపారు. జనవరి 9 నుంచి 20 వరకు మున్సిపల్ కార్యాలయంలో ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, మహిళలకు నెలకు రూ.2500, విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచితంగా సరఫరా చేయటం, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాలకు అర్హులు తమ దరఖాస్తులను అందజేశారు. వీటిలో ప్రస్తుతం మహాలక్ష్మి పథకంలో గ్యాస్ పథకానికి అందిన దరఖాస్తుల్లో సుమారు 2,008 మంది దరఖాస్తుల్లో తప్పులు దొర్లినట్లు తేలిందని, ఇంటింటి సర్వే నిర్వహించి ఆ తప్పులను సవరించి సక్రమంగా నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సమగ్రంగా నమోదు చేయండి: చైర్మన్ డీవీ

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన పటిష్టంగా అమలు చేయాలని, ఇంటింటికీ వెళ్లి సమగ్రంగా వివరాలు సేకరించి నమోదు చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు స్థాయి పరిశీలన అధికారుల బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం త్వరలో మహాలక్ష్మిలో గ్యాస్, విద్యుత్ పథకం అమలుకు సన్నాహాలు చేస్తోందని తెలిపారు. పరిశీలనకు వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు. మేనేజర్ అంకుషావలీ, ఆర్‌ఐ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

సరైన వివరాలు ఇవ్వండి..

సుజాతనగర్: మహాలక్ష్మి పథకానికి సంబంధించి సరైన వివరాలు ఇవ్వని లబ్ధిదారులు శుక్రవారం సాయంత్రంలోగా గ్యాస్ కనెక్షన్ల సరైన సమాచారాన్ని సర్వే బృందానికి అందజేయాలని ప్రత్యేకాధికారి త్రినాథ్ బాబు సూచించారు. మండల వ్యాప్తంగా కొనసాగుతున్న గ్యాస్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన సుజాతనగర్‌లో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పథకాల్లో భాగంగా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పంపిణీకి కసరత్తు చేస్తోందని తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో చాలావరకు తప్పుగా నమోదు చేసినట్లు చెప్పారు. వాటిని పరిశీలించి సరిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, కార్యదర్శి బి.నరేందర్, బిల్ కలెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



సుజాతనగర్‌లో ఓ వృద్ధురాలి గ్యాస్ వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

‘గృహజ్యోతి’వివరాల సేకరణ

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ శాఖ కసరత్తు ప్రారంభించింది. గృహ విద్యుత్ మీటర్ ఉన్న ప్రతీ ఇంటికి వెళ్లి సర్వీసు నంబర్ ఆధారంగా యజమాని రేషన్ కార్డు, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్ సేకరించేలా లైన్‌మెన్లను సమాయత్తం చేశారు. ఈ ప్రక్రియను ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈలు రాము, రవి శుక్రవారం స్వయంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

‘ఐపాస్’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో వందశాతం విజయం సాధించేందుకు ఉపయోగపడే ఐపాస్ పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పదో తరగతి ఆంగ్లంలో ఎక్కువ మార్కులు, వంద శాతం రిజల్ట్ సాధించేందుకు ఐపాస్ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్‌ను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి మాట్లాడుతూ... జిల్లాలోని హైస్కూళ్లలో ఆంగ్లం బోధిస్తున్న ఉపాధ్యాయులు ఈ ఐపాస్ పుస్తకాన్ని రిఫరెన్స్‌గా తీసుకొని విద్యార్థులకు ఆంగ్లాన్ని సులభంగా బోధించవచ్చని చెప్పారు. రానున్న 40 రోజులలో పదో తరగతి విద్యార్థులు, టీచర్స్‌కు ఉపయోగపడే విధంగా ఈ పుస్తకం డిజైన్ చేయబడిందని, ఎగ్జామినేషన్ పాయింట్ ఆఫ్ వ్యూలో ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆంగ్ల రిసోర్స్ పర్సన్ షేక్ మీరా హుస్సేన్, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ షరీఫ్, పాల్వంచ డివిజన్ ఎల్టా ప్రెసిడెంట్ వెంకన్న, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మాధవరావు, ఏఎంఓ నాగరాజశేఖర్, సైదులు సతీష్, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



టేకులపల్లి: వేడుకలో పాల్గొన్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ 53వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు యూనియన్ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ అన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి సహకరిస్తూనే, సమస్యల సాధనకు పాటుపడాలన్నారు. ఐఆర్ పెంపు, పీఆర్సీ, సీపీఎస్ రద్దుతో పాటుగా ఐఈఆర్‌పీ, కేజీబీవీ, గురుకుల, ఆశ్రమ పాఠశాలల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రవి, సంజీవరావు, సాయిబాబు, దీనాసింగ్, జి.వెంకటేశ్వర్లు, సాల్మాన్, రాంరెడ్డి, సుధారాణి, జహంగీర్ షరీఫ్, నర్సయ్య, దుర్గారాణి, సుధారాణి, బేబిరాణి, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పీఆర్‌టీయూ టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు.

ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీఓ జేఎల్ గణేష్ గాంధీ హాజరయ్యారు. మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గానికి మంచి సేవలు చేస్తున్న పీఆర్‌టీయూని అభినందించారు. అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు పూనెం నరసయ్య, రవీందర్, విజయనిర్మల, ప్రసాద్, జి.మోతీలాల్, బిబాలు, సంతు, పార్వతి, బి.బాలాజీ, డి.మంగీలాల్, డి.రాజేష్ కన్నా, ఎస్తేరమ్మ, ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదని ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మడవి సరస్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల సమావేశాలకు ప్రతీసారి పూర్తిస్థాయిలో అన్నిశాఖల అధికారులు హాజరు కాకపోవడం వలన సమస్యలు పరిష్కారం కావడం లేదని ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. కారెగట్టు, దంతలబోరు, పాండురంగాపురం తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు సరఫరా జరగడం లేదని, వచ్చిన నీటిని కూడా ప్రజలు తాగడం లేదని ఎంపీటీలు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పాండురంగాపురంలో డ్రైనేజీ నిర్మాణాన్ని మార్పు చేయాలని ఎంపీటీసీ కోరారు. ఉపాధి హామీ పథకం కింద 2024-2025 సంవత్సరానికి మండలంలో రూ.67లక్షల విలువ గల 12 పనులు మంజూరు అయినట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. కారెగట్టుతోపాటు పలు గ్రామపంచాయతీలకు స్థలం కేటాయించడంలో జాప్యం జరుగుతోందని, అటవీశాఖ అధికారుల అడ్డంకుల వలన పంచాయతీ భవనం పనులు ప్రారంభం కావడం లేదని అటవీశాఖ అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయించాలని ఎంపీటీసీ రవి కోరారు. పంచాయతీ అధికారులు ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. పంచాయతీల్లో పాలకవర్గాలు ఉన్నప్పుడు ప్రజాసమస్యలపై పట్టు ఉండేదని ఇప్పుడు ఉన్న ప్రత్యేకాధికారులు సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అప్పారావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ నారాయణ, ఏపీఓ రంగా, వైస్ ఎంపీపీ గురవయ్య, ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



కరకవాగులో వీధులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వామి

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు కరకవాగు గ్రామంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్య ఉందని, రోడ్లు, డ్రైనేజీలు లేవని, పారిశుద్ధ్య పనులు చేయడం లేదని, వీధిలైట్లు వెలగడం లేదని తదితర సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఏఈ రాజేశ్, భట్టు మురళీ, భీమా నాయక్, వీరన్న, రాందాస్, శ్రీను పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండేలా చూసుకోవాలని డీఎల్పీఓ రాజీవ్‌కుమార్ సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం, మాణిక్యారం గ్రామపంచాయతీలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోందని, రోజువారీగా రికార్డులలో వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

‘మాస్‌లైన్’ ఆవిర్భావం శుభసూచికం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: దేశంలో విప్లవ సంస్థలు ఏకతాటి మీదకు వచ్చి ఒకే పార్టీగా ఆవిర్భవించటం అభినందనీయమని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ప్రజాపంథా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. భారతదేశ కమ్యూనిస్ట్ చరిత్రలో విప్లవ పార్టీలు చీలికలు మాత్రమే చూశామని, దానికి భిన్నంగా ఐక్యం అవడం కూడా ఉంటాయని నిరూపించబోతున్నట్లు తెలిపారు. పార్టీలో ఒకే రకమైన ఆలోచనలు ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. భిన్నవైఖరులు ఉంటే చీలికలకు దారి తీస్తాయని పేర్కొన్నారు. గురుతర బాధ్యత కలిగిన ప్రజాపంథా ఆధ్వర్యంలో పీసీసీ, సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ లాంటి కొన్ని సంస్థలు విలీనం అయి సీపీఐ(ఎంఎల్)– మాస్‌లైన్‌గా ఆవిర్భవించనున్నాయని చెప్పారు. మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న విలీన ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మాచర్ల సత్యం, బుర్ర వెంకన్న, యాకుబ్‌షావలీ, పృథ్వీ, పాయం వెంకన్న, గురునాథం పాల్గొన్నారు.

‘సొసైటీ’ జప్తులను ప్రతిఘటించాలి

జూలూరుపాడు: సొసైటీ జప్తులను ప్రతిఘటించాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో సహకార సంఘాలు వ్యవసాయేతర రుణాల కింద రైతులకు పట్టా పాస్ బుక్, పహాణీ నకలుపై గేదెలు, ద్విచక్రవాహనాలు ఇచ్చాయన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయేతర రుణాల రికవరీ చేసేందుకు జప్తు చేస్తామని రైతులను భయభ్రాంతులకు గురిచేయడం సరైన విధానం కాదన్నారు.

ఈ ఏడాది పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో జప్తులు చేయడం ఎంతవరకు సమంజసమని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. రైతు రుణమాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 4న బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీలలో చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులను జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య ఆయన చాంబరలో శుక్రవారం అభినందించారు. మాట్లాడుతూ... సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందిన శ్రీచైతన్య భారతి స్కూల్ (రామవరం), త్రివేణి, మాస్టర్ ఈకే, శారదా విద్యాలయాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ స్థాయి యోగా చాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు గెలిచి జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. చిన్నారులకు యోగా శిక్షణ ఇచ్చిన సింగరేణి సేవా సమితి యోగా గురువు గుమలాపురం సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం సుశీల్‌కుమార్, జీకే కిరణ్‌కుమార్, ఇన్‌చార్జ్ వెల్ఫేర్ పీఓ పి.ప్రభాకర్, శ్రీచైతన్య భారతి పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆదిలక్ష్మి, పీఈటీ టి.లక్ష్మి పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కార్మిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె, బంద్ చేపడుతున్నట్లు చెప్పారు. లేబర్ కోడ్స్, ఎన్‌ఈపీ చట్టం, విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2021 విడుదల చేసిన కనీస వేతనాల జీఓలను తక్షణమే గెజిట్ చేసి అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు, జిల్లా నాయకులు కూరాకుల నరసింహారావు, సీఐటీయూ మండల కన్వీనర్ యాసా నరేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు గార్లపాటి వీరభద్రం, ఐఎన్‌టీయూసీ నాయకులు మందా బాబు, ఐఎఫ్‌టీయూ మండల కన్వీనర్ రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత శిఖరాలకు ఎదగాలి..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని సాహితీ కళాశాల డైరెక్టర్ ఎంసీ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం సాహితీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముందుగా సరస్వతీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం హైస్కూల్ డైరెక్టర్ తుమ్మలపల్లి ప్రసాద్, మార్గదర్శిని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ అర్వపల్లి రాధాకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

సుజాతనగర్ ఎంపీపీకి అవిశ్వాస గండం

- బలపరీక్షకు రంగం సిద్ధం
- ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన మెజారిటీ ఎంపీటీసీలు
- వైస్ ఎంపీపీకి అనుకూలంగా మారుతున్న రాజకీయం



ఎంపీపీని మార్చాలని దీక్ష చేస్తున్న వైస్ ఎంపీపీ అనిత, ఎంపీటీసీలు (ఫైల్)

సుజాతనగర్: రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో సైతం రాజకీయ వేడి రాజుకుంటోంది. సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదనలు పంపించడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. 2019 ఆగస్టు 6న ఎంపీటీసీ సభ్యులు కొలువుదీరారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎంపీపీ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయితేనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తికావడంతో ఇప్పటి వరకు మౌనంగా ఉన్న ఎంపీటీసీలు ఇటీవల అవిశ్వాసానికి తెరలేపారు.

గతంలోనే రచ్చకెక్కిన పదవీ వ్యామోహం...

మండలంలో మొత్తం ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ ఎన్నికల సమయంలో భూక్యా విజయలక్ష్మి, బానోత్ అనిత (వైస్ ఎంపీపీ) చెరో రెండున్నరేళ్లు ఎంపీపీగా ఉండాలని అప్పటి ఎమ్మెల్యే వనమా, టీఆర్‌ఎస్ పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు. ఈ ప్రకారం 2022 ఏప్రిల్ నాటికే వైస్ ఎంపీపీ అనిత ఎంపీపీ కావాల్సి ఉంది. అయితే అది కార్యరూపం దాల్చకపోవడంతో ఆ హామీ మేరకు రాసుకున్న అగ్రిమెంటును అమలు చేయాలని, ఒప్పందం ప్రకారం తనకు ఎంపీపీ పదవి ఇవ్వాలంటూ వైస్ ఎంపీపీ బానోత్ అనిత ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ విజయలక్ష్మి ఎంపీపీ పదవీ వదిలేది లేదని భీష్మించుకుంది. దీంతో వైస్ ఎంపీపీలో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. ఇప్పుడకు అవకాశం రావడంతో అవిశ్వాసంతోనైనా ఎంపీపీ కుర్చీ దక్కించుకునేందుకు పలువురు ఎంపీటీసీల మద్దతుతో అనిత ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది.

సమావేశాలు జరగకుండా...

ప్రతీ మూడు నెలలకోసారి జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాలు వాయిదాలు పడుతూ వస్తున్నాయి. నిబంధనల మేరకు 1/3 వంతు సభ్యులు హాజరైతే సమావేశం నిర్వహించుకునే వీలుండగా.. కోరం పూర్తికాకపోవడంతో సమావేశాలు కూడా జరగలేదు. దీంతో హాజరైన ఆయా శాఖలకు చెందిన అధికారులు నివేదికలు చదవకుండానే వెనుదిరిగిన సందర్భాలు చోటుచేసుకున్నాయి.

గడువు దాటడమే ఆయుధం...

ప్రస్తుత ఎంపీపీ పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీతో పూర్తవుతోంది. ఇందుకు మరో ఆరు నెలలు మాత్రమే ఉంది. అవిశ్వాసం పెట్టేందుకు కూడా చట్టం ప్రకారం అవకాశం ఉండటంతో ఇప్పటి వరకు ఓపిక పట్టిన వైస్ ఎంపీపీ, ఇతర ఎంపీటీసీలకు ఒక్కసారిగా బలం వచ్చింది. ఈ మేరకు ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ మెజారిటీ సభ్యులు కొత్తగూడెం ఆర్డీఓ శిరీషను ఇటీవల కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలో మొత్తం 8 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను వైస్ ఎంపీపీ అనితతో సహా గరీబ్‌పేట, సర్వారం, సీతంపేట బంజర, నాయకులగూడెం (మొత్తం ఐదుగురు) ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరారు. ఇదే జరిగితే వైస్ ఎంపీపీకి అనుకూలంగా మారే అవకావం ఉందని మండల నాయకులు భావిస్తున్నారు.

నిబంధనల ప్రకారం చేస్తాం...



అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటూ ఎంపీటీసీ సభ్యులు ఆర్డీఓను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ మేరకు ఎలా అనుసరించాలనే విషయాలను ఆర్డీఓ తనకు వివరించారు. త్వరలో ఎంపీటీసీలకు నోటీసులు అందజేసి నిబంధనల ప్రకారం బలపరీక్ష పెడతాం.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్